# రహస్యం !

పోతులు మనిషి ఆబోతులా వుంటాడు!. కండలు తిరిగిన శరీరంతో మొరటుగ అవుపిస్తాడు. ఆతగాడికి పెళ్లీడు వచ్చినా పిల్లనీయటానికి ఆడపిల్ల తండ్రులు భయపడతారు. కోపమొస్తే పెళ్లాన్ని గుద్దుకు చంపేస్తాడేమోనే భయం!

పోతులు అనాధ! కన్నతల్లి వద్దనుకుని బిడ్డని కుప్పతొట్లో పారేసిన పసికందును ఎత్తుకొచ్చి అపురూపంగ పెంచాడు మస్తాన్!

ఆ పసిగుడ్డుది ఏ కులమో... ఏ మతమో తెలీకపోయినా ముస్లిమ్ అయిన మస్తాన్ ప్రేమతో చేరతీశాడు. మటను కొట్టు మస్తానంటే తెలియని వారులేరు. పిల్లాడు దొరికేనాటికి మస్తాను వయసు యాభైదాటింది!.

మస్తాన్‌కి మూడు పెళ్లిళ్లు! ఏ ఒక్క భార్యకు సంతానంలేదు. అయినా మరోపెళ్లి చేసుకోలేదు. అయిదేళ్ల తేడాతో మొదటి... రెండవ భార్య చనిపోయారు. మూడో పెళ్లాం రోగిష్ఠిది! వేళకోముద్ద ఉడకేసి పెడుతుంది. మిగతా సమయాల్లో మంచానికి అతుక్కుని పడుకోవటం తప్ప వేరే ఏపని చెయ్యలేదు.

రోగమేమిటో ఆమే చెప్పలేదు. బాధలు పైకి కన్పించేవి... ఒకరికి చెప్పుకుంటే అర్థమయ్యేవీ కావు. డాక్టర్లుకు చూపిస్తే ఇదొక అంతుచిక్కని వ్యాధి... కొద్దిరోజుల్లోనే మనిషి చిక్కి శల్యమై కన్నుమూస్తుందని చెప్పటంతో మస్తాన్ మానసికంగ కృంగిపోయాడు. ఏం చేయటానికీ దిక్కుతోచలేదు.

ఇన్నాళ్లూ ఇంట్లో ఆడదిక్కు వుండటాన దొరికిన పసివాడిని పెంచే బాధ్యత ఆమెకు వప్పగించాడు. ఈ రోజోరేపో... పిల్లాడి బాగోగులు చూడటం... పెంచటం... నీళ్లుపోసి బువ్వ తిన్పించే పనులు తానే చేయాల్సివస్తుంది.

డాక్టర్లు చెప్పినట్టు నెల తిరక్కుండానే మస్తాన్ మూడోభార్య చాందినీ కన్నుమూసింది.పెళ్లాం చనిపోయేనాటికి పోతులు అయిదేళ్లవాడు. ఒకవైపు... దుకాణం తెరిచి మటన్ కొట్టి అమ్మితేగాని బతుకు గడవదు. ఈపని తప్పించి మరో పనేదీ చెయ్యలేడు మస్తాన్. పైగా వయస్సు మీదపడుతోంది!.

తాను చేసే పని పోతులుకు నేర్పకూడదని... బళ్లోకి పంపి చదివించాలనేది మస్తాన్ కోరిక. కానీ స్కూలుకు పంపినా పలక పగలగొట్టటం... పుస్తకాలు చించటం.... తోటి పిల్లలను కొట్టటం... టీచర్లకెదురు తిరగటం లాంటి తుంటరి పనులు చేస్తున్నాడని తెల్సి... పిల్లవాడిని కాన్వెంట్‌లో చేర్చాలని నిర్ణయించుకున్నాడు.

పట్టుమని నెలరోజులైనా కాన్వెంట్‌కు పోయినాడో లేదో పిల్లవాడి మీద ఫిర్యాదులు.

అక్కడైన బుద్ధిగా చదువుకుంటాడని ఆశించిన మస్తాన్‌కు చుక్కెదురైంది.

పిల్లల వెంట గల్లీల్లో తిరగటం... ఆడుకోవటం... వేళకు తిండి... కంటికి నిద్ర తప్ప మరో పని చేసేవాడు కాదు పోతులు. మస్తాన్ మాట కూడా వినేవాడు కాదు. కన్నబిడ్డ కంటే మిన్నగ చూసుకునే మస్తాన్ పిల్లవాడిని కొట్టటానికి మనసొప్పేది కాదు.

పిల్లవాడిని పెంచి నామకరణం చేసి ఆప్యాయంగ గుండెలకు హత్తుకుంటున్న తనకు పోతులు పట్ల అవ్యాజనీయమైన ప్రేమ! బిడ్డల కోసం మూడు పెళ్లిళ్లు చేసుకున్నా అతని ఆశ ఫలించనేలేదు.

అలాంటిది దొరికిన బిడ్డే అల్లా ఇచ్చిన బిడ్డగా భావించి... వాడికి తండ్రి అయినందుకెంతగానో సంబరపడ్డాడు! ఆనందించాడు. శిధిలావస్తలో వున్న పూర్వపు మటన్‌షాపు మీద వచ్చే ఆదాయం... పస్తులుండకుండా బతకటానికి సరిపోతున్నది!

మతమేమిటో తెలియని పిల్లవాడిని తెచ్చి పెంచుకుంటున్న మస్తాన్ నిర్ణయాన్ని ఇరుగుపొరుగు... అతని మతస్తులు... కులపెద్దలు మొదట్లో అభ్యంతరాలెన్ని చెప్పినా లెఖచేయలేదు. మస్తాన్ పూర్వీకులు హైదరాబాద్ నవాబుల దివాణంలో కొలువు చేసుకుంటూ దర్జాగ బ్రతికి వాళ్లే! తాతముత్తాతలు... ఆనాటి నవాబుగారికి అంతరంగిక సలహాదారులుగ వుండేరోజుల్లో బోలెడన్ని ఈనాములు ఏర్పరుచుకున్నారు. వెండి పళ్లాల్లో భోజనం చేసేవారిని తండ్రి చెప్పగా విన్నాడు తన చిన్నతనంలో మస్తాన్.

బంగారం... వెండి... నగలు... వజ్రవైఢూర్యాలు... మరకతమాణిక్యాలు వున్న అపార సంపదను పెట్టెలకు నింపి కోటకు ఆవల నాలుగు దిక్కుల్లో ప్రత్యేకించి వాటికోసం కట్టించిన నేల మాడిగల్లో నిక్షిప్తంచేసి... యుద్ధ సమయాల్లో వాటిని కాపాడే బాధ్యత నలుగురు ఆత్మీయులైన అంతరంగిక సలహాదారులకు మాత్రమే రహస్యంగా చెప్పి మరోకంటికి తెలియనీయకుండా కట్టు దిట్టంచేశాడట నవాబు ఆరోజుల్లో !

తూర్పు దిక్కున వున్న మాడిగ తాళం చెవి ముత్తాతగారు చనిపోతూ తాతగారికి అప్పగించగా... ఆయన మస్తాన్ తండ్రికి అప్పగించటం జరిగింది. తర్వాత రాజ్యాధినేత నవాబు మరణానంతరం నాలుగు దిక్కుల వున్న అపార సంపద గురించి ఇతరులకు తలీకుండా పోయింది. కొన్నాళ్లకు దేశానికి స్వాతంత్ర్యం రావటంతో నవాబుల సంస్థానాన్ని ప్రభుత్వం స్వాధీనపర్చుకున్న తరుణంలో... మస్తాన్ తండ్రి చనిపోతూ తూర్పు మాడిగలో గల నవాబు సంపద తాలూకు తాళం చెవి అతని పరం చేసి చనిపోయాడు.

ఇప్పటికీ మాడిగ తాళంచెవి అయితే మస్తాన్ వద్ద వున్నదన్న మాటేగానీ.... దరిద్రం అనుభవిస్తున్నా మాడిగ ఎక్కడుందో తనకు తెలిసినా... ఎప్పుడైనా అక్కడికెళ్లి చూచి రావటమేగాని... ధనాగారాన్ని వెలికితీయ సాహసించలేక పోయాడు.

ఏ అర్ధరాత్రి సమయంలోనైనా వెళ్లి భూగర్భ మాడిగ తెరవటం ఎవరి కంట

అయినా పడితే... ఇంకేమైనా వుందా?... పోలీసులు నిర్భంధిస్తారు. కేసుపెడతారు... శిక్షపడుతుంది... ఇన్ని రకాల భయాలు మస్తాన్‌ను కలవరపెడుతున్న కారణాన.... దాని జోలికి పోతల్చుకోలేదు.

పోతులు పాతికేళ్లవాడైనాడు. ఇక వాడి పెళ్లి చేయాలన్పించింది మస్తాన్‌కి! అయితే... ముస్లిం మతస్తుల పిల్లను కోడలుగా తెచ్చుకోవటమా... లేక హిందూ మతస్తుల పిల్లకోసం ప్రయత్నం చేయటామానే సందిగ్ధంలో పడ్డాడు.

చదువు అబ్బలేకపోయినా అపారమైన తెలివితేటలున్న పోతులు, ల్యాండ్ మాఫియాగ అవతారమెత్తి అబ్బాజాన్‌కి తెలీకుండా లక్షలు సంపాదించగల స్థితికి ఎదిగాడు. పోలీసు యంత్రాంగాన్ని తన గుప్పిటలో పెట్టుకోగల స్థాయి అతనిది!. రాజకీయపరమైన పలుకుబడీ ఆర్జించాడు. ఎవరి వాటాలు వారికి అందిస్తూ ల్యాండ్ సెటిల్‌మెంట్ కేసుల్లో తారాజువ్వలా నింగిలోకి దూసుకుపోతున్నాడు.

కోటిరూపాయలు పెట్టి జూబ్లీహిల్స్‌లో అధునాతనమైన బంగళా కట్టించాడు. బెంజికారు కొన్నాడు. ఎప్పుడూ వెంట మంది మార్బలం!. ముందు అపాయింట్‌మెంట్ తీసుకునిగానీ పోతులును కల్సేందుకు వీల్లేదు ఎంతటివారైనా !

కొద్ది నెలల క్రితమే న్యూస్ పేపర్స్‌లో యాడ్ ఇచ్చి ఎం.బి.ఏ. చదివిన అందమైన అమ్మాయిని తన పి.ఏ.గా వుద్యోగమిచ్చాడు. ఆమెకో కారు... యాభైవేలు జీతం వుండేటందుకు ఇల్లు ఏర్పరిచాడు.

శక్తి సన్నగిల్లటంతో మస్తాన్ మటన్ దుకాణం మూసేశాడు. పోతులుకు పెళ్లి చేయాలనే కోరిక తీరటం లేదనే బాధ కలవరపెడుతోంది! చెడు అలవాట్లు తిరుగుళు పోతులు బంగారు భవితను పాడుచేస్తాయేమోనే దిగులు మరోవైపు కలచివేస్తోంది.

'అబ్బాజాన్... మనం బంగళాకి వెళ్లిపోదాం!. ఈ పాత ఇల్లు మనస్థాయికి తగదు. అమ్మేద్దాం!...'

'ఈ ఖాన్‌దాన్‌లోనే పుట్టిపెరిగాను బిడ్డా! ఇక్కడే మట్టైపోవాలని వుంది...'

'అంతఖర్మ మనకేమొచ్చె?- నేను రెండుచేతులా సంపాదిస్తున్నానుకదా?- నిన్ను బంగళాలో వుంచి... కారులో తిప్పాలని ముచ్చటపడుతున్నాను అబ్బాజాన్...'

'నివ్వింతటి అదృష్టవంతుడివౌతావని కలలోనైనా వూహించలేదు బిడ్డా!. ఎవరి బిడ్డవో నాకాడ పెరిగినావు. నేన్నీకు చేసిందేమీ లేకపోయినా నీకైనువ్వు ఎదిగేవు - బాగుపడ్డావ్! లక్షలు కోట్లు సంపాదిస్తున్నావ్ - నీ గొప్పతనం చూచే అదృష్టం నా బీబీకి లేకపోయింది. అది బతికి వుంటే ఎంత సంబరపడేదో?...'

'అవును బాబా ! ఏం చేస్తాం? అల్లా ఎప్పుడు ఎవరిని తీసుకెడతాడో చెప్పలేం కదా!-'

'అవును - అద్సరే... నీ షాదీ నేను చనిపోయేలోపు చూడాలని వుంది... నాకోరిక

ఎప్పుడు తీరుతుందో? ఏమో?'

'ఫికర్ మత్‌కరో బాబా! నాకేం వయసు మించిపోయిందని?- అయినా నీకోవిషయం చాలారోజుల నుండి చెప్పాలనివుంది. సమయం వచ్చిందికదా... ఇప్పుడు చెప్తాను...'

'అదేంటో చెప్పు బిడ్డా.... ఎవరినైనా ప్రేమిస్తున్నావా?'

'అవును అబ్బాజాన్! ఆరు నెలలుగా నా వద్ద నాకు పి.ఏ.గా పనిచేస్తున్న పిల్ల. బాగా చదువుకున్నది... అందంగ కూడా వుంటుంది... పేరు జాస్మిన్!... ఆ పిల్లంటే నాకు ఇష్టం!. ఆ అమ్మాయినే చేసుకుందామని వుంది... నువ్వేమంటావ్ బాబా...?'

'నేను అనటం కాదు బిడ్డా!. నీ మనసులో మాట ఆమెతో చెప్పు. వాళ్ల పెద్ద వాళ్లతో మాట్లాడి వాళ్లూ అంగీకరిస్తే మీ షాదీకి అడ్డు వుండదు....'

'మనం వెంటనే బంగళాలోకి మారితే... నా స్థాయి... ఆర్థిక స్తోమత చూచేక జాస్మిన్ పేరెంట్స్ కాదనలేరు. ఏమంటావ్ అబ్బాజాన్...'

'వాళ్లదే కులమో... ఏ మతమో తెల్సుకో! ఆ తర్వాత వాళ్లకి పిల్లనీయటం ఇష్టమైతే నీ ఆశ ఫలిస్తుంది. నాకోరిక నెరవేరుతుంది! చూడు పోతులూ! నువ్వు నా సొంత బిడ్డవు కాదు కనుక మహమ్మదీయుడివి కాదు- నువ్వు హిందువుల బిడ్డవే అయివుంటావ్. నీ పుట్టుక... నడత ... మాటతీరు... మటన్ తినకపోవటం... వుర్దూ నేర్చుకోకపోవటం చూచి ఖచ్చితంగ చెప్పగలను. నాకు పిల్లల్లేరు పసితనం నుండీ నావద్దే పెరిగావ్... కాదు... నాబిడ్డగానే పెంచాను. నీకు పేరు పెట్టటం కూడా హిందూ మతస్తుడవై వుంటావనే 'పోతులు' అని నీకు పేరు నిర్ణయించటం జరిగింది.

గతాన్ని నెమరేసుకుంటూ మొదటిసారిగ నిజాన్ని వెల్లడించాడు మస్తాన్!.

మస్తాన్ చాయ్ తాగుతూ టి.వీ.లో వార్తలు వింటున్నాడు.

నైజాం నవాబు ఎప్పుడో నిర్మించి... శిధిలావస్థలో వున్న కోట వెలుపలి భాగాలో గుర్తుతెలియని వారు గుప్త నిధుల కోసం రహస్యంగ తవ్వకాలు జరుపుతున్నారని... ఈ విషయంలో పురావస్తుశాఖ వారు గాని...ప్రభుత్వంగానీ నిర్లక్ష్యధోరణి వహిస్తున్నారనీ... నిధులు గనుక బైటపడితే... అవి వ్యక్తుల పరం కాకుండా... ప్రభుత్వమే తవ్వకాలు చేపట్టి వెలికి తీస్తే గుప్త నిధులను స్వంతం చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారనీ... ఆ నిధులు ఇతరుల కెవ్వరికీ చెందకుండా చూడాలని... ఇంకా అనేక రకాల వార్తలను ప్రసారం చేస్తూ దొంగతనంగ తవ్వుతున్నవారిని చూపించటంతో... మస్తాన్ కలవరపడ్డాడు.

ఇన్నేళ్లుగా మాడిగ తాళంచెవి ఒకటి తనవద్దే వున్నదని... ఇది తాతముత్తాతల కాలం నుండి తనకు సంక్రమించిందనీ... పోతులుకు ఇంతకాలంగ చెప్పలేదు.

తవ్వకాలు తూర్పుదిక్కునే జరగటం టీ.వీ.లో చూపించటం వీక్షించిన మస్తాన్ తానే ఆ ప్రదేశానికి కొడుక్కి మాటమాత్రమైనా చెప్పకుండా రాత్రికి రాత్రీ హుటాహుటిన

డ్రైవర్‌ని వెంటతీసుకుని కారులో ఆ ప్రదేశానికి చేరుకున్నాడు. ఆ సొమ్ము తనకు చెందవలసిన వారసత్వసంపదనీ... ఈ వాస్తవాన్ని తాతముత్తాతలు తండ్రికి చెప్పగా... తండ్రి తనకీ విషయం చెప్పి మాడిగ తాళం చెవి సంగతి కూడా అక్కడివారికి చెప్పాలనే ప్రయత్నంలో బయల్దేరాడు మస్తాన్.

ఈ విషయం పోతులుకు చెప్తే... మారణాయుధాలతో రౌడీగ్యాంగ్‌ను వెంటతీసుకుని బయల్దేరి అసలు విషయం పబ్లిక్‌కి తెలిసి అంతా రసాభాసవుతుందనే అలోచనతో తాను ఒక్కడే రహస్యంగ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం చేరుకున్నాడు.

అప్పటికే అక్కడ చాలామంది గుమిగూడి వుండటం... అధికారులను పోలీసు బలగాలను చూచి తనకేమీ తెలియనట్టే... తానేమీ ఎరగనట్టే... కేవలం ప్రేక్షకుడిగా అక్కడికి చేరుకుని పలుగులతో తాళం పగలగొట్టి లోపలగల నిధిని విస్తుపోయి చూస్తూ వుండిపోయారంతా!

అంత నిధి ఆ మాడిగలో వున్నదని తెలుసుగానీ మస్తాన్ ఏనాడూ వాటిని కళ్లతో చూచిన పాపాన పోలేదు. కోటాను కోట్లు విలువచేసే నిధి చూచేక మస్తాన్ కు గుండె ఆగినట్టయింది. ఇంత సొమ్ము తాను చేయిజార్చుకున్నాడా?. ఈనాటికి ఈ సంపద తనది కాకుండాపోతోందా?- ప్రభుత్వం స్వంతం చేసుకోనున్నదా?.

రాజుల సొత్తు రాళ్లపాలు అంటే ఇదే కాబోలు అన్పించింది మస్తాన్‌కు !

'హే అల్లా' అంటూ బిగ్గరగా కేకపెట్టిన మస్తాన్ నిలబడి చూస్తున్నవాడల్లా నేలమీద దభాలున కుప్పకూలాడు.

ఇది గమనించిన అధికారులు అంబులెన్స్‌కోసం ఫోన్ చేయటం... క్షణాలమీద వాహనం అక్కడికి చేరుకోవటం... అందులోకి మస్తాన్‌ను పడుకోబెట్టాక సిటీ వైపు అంబులెన్స్ శరవేగంతో పరుగుపెట్టటం... అంతా క్షణాల్లో జరిగిపోయింది.

మస్తాన్ వెంట వచ్చిన కారు డ్రైవరు తిరిగి పోతులు బంగాళా చేరుకుని జరిగింది వివరించాడు.

నివ్వెరపోయిన పోతులు అదేకారులో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రి చేరుకున్నాడు.

స్పాట్‌లోనే ప్రాణంపోయిందని వైద్యులు నిర్ధారించి అదే విషయాన్ని పోతులుకు చెప్పగా చిన్నపిల్లాడిలా వలవలా ఏడ్చాడు. తనకున్న ఏకైక పెద్దదిక్కు... తనను పెంచి పెద్దచేసిన 'అబ్బాజాన్' సడన్‌గ కన్నుమూసినందుకు విలవిల్లాడేడు.

అసలు అబ్బాజాన్ అర్థరాత్రి కార్లో డ్రైవర్‌ను వెంటతీసుకుని గోల్కొండ ఫోర్ట్ వైపు ఎందుకు వెళ్లాడో... పోతులుకి అంతుచిక్కని రహస్యంగానే వుండిపోయింది.

--- సమాప్తం ---